క్లుప్తంగా

లైంగికదాడికి యత్నించిన యువకుడి అరెస్ట్

కమలాపూర్: చెవిటి, మూగ మహిళపై లైంగిక దాడికి యత్నించిన కేసులో మండల కేంద్రానికి చెందిన కొడారి అరుణ్‌ను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ బొలుమల్ల సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చెవిటి, మూగ మహిళపై అరుణ్ ఇటీవల లైంగికదాడికి యత్నించాడని, బాధితురాలి సోదరుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన అనంతరం నిందితుడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపించినట్లు ఆయన వివరించారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసె

ధర్మసాగర్(వేలేరు): ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పు అంటుకొని మంటలు చెలరేగాయి. ఈ సంఘటన మండలంలోని బండతండాలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బండతండాకు చెందిన మాలోతు రాజు గ్రామ పంచాయితీ సిబ్బందిగా పని చేస్తున్నారు. సోమవారం రాత్రి తమ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి 12.30 గంటలకు గుడిసెలో ఒక్కసారిగి మంటలు చెలరేగాయి. గమనించిన కుటుంబ సభ్యులు పెద్దగా అరవడంతో చుట్టుపక్కలవారు వచ్చి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయాయని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు



గాయపడిన విజయ్

ఎల్కతుర్తి: ఇంటికి పెయింట్ వేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ మెయిన్ తీగకు తగలడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దామెర గ్రామానికి చెందిన గుర్రపు విజయ్ వృత్తిరీత్యా మండల కేంద్రంలోని ఓ ఇంటికి పెయింట్ వేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ మెయిన్ వైర్‌కు చేయ్యి తగలడంతో షాక్‌కు గురై కింద పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

'కడియం'ను కలిసిన గ్రామస్తులు



ధర్మసాగర్ : మండలంలోని ముప్పారం గ్రామస్తులు మంగళవారం మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని గోపారువాగు నిర్మాణం కోసం రూ. 35 లక్షలు నిధులు మంజూరు చేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోనెల సమ్మక్క, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గడ్డం రాజేందర్, మాజీ ఎంపీటీసీలు మేకల విజయ్ కుమార్, ప్రసాద్, నాయకులు కోతి సంబరాజు, రమేష్‌రెడ్డి, వివిధ కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం కమిటీ ఎన్నిక



కేతిపల్లి శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు

దామెర: మండల రెడ్డి సంఘం ఎన్నిక మంగళవారం జరిగింది. మండల అధ్యక్షుడిగా ఒగ్లాపూర్ గ్రామానికి చెందిన కేతిపెల్లి శ్రీధర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రం సమీపంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో మండల రెడ్డి సంఘం ఆత్మీసమ్మేళనం నిర్వహించి మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొండి మాధవరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆవాల రవీందర్ రెడ్డి, కూనాటి సునీల్‌రెడ్డి, కోశాధికారిగా గంకిడి బుచ్చిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యరు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. గ్రామ స్థాయిలో రెడ్డి సంఘాలను బలోపేతం చేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులను రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు తదితరులు అభినందించారు. రెడ్డి కులస్తుల హక్కుల సాధనకు తనవంతుగా పోరాటం చేస్తానని ఆయన తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు అభినందించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా పోషణ్‌మాసం వేడుకలు
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన



కమలాపూర్ : బాలింతలు, తల్లులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ రజిత

కమలాపూర్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ టీచర్ రజిత అన్నారు. మండలంలోని కన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలోని రాములపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ్‌మాసం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి బాలింతలు, తల్లులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కిశోర బాలికలు, బాలింతలు, తల్లులు పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. గర్భిణులు, బాలింతలు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే తెలుపాలని అన్నారు. బాలింతలు, తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : గర్భిణులు, బాలింతలు, తల్లులు చిరుధాన్యాలు తీసుకుంటేనే ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని ఏఎన్ఎం రోసిలిన్ అన్నారు. జాతీయ పోషణ మాసం సందర్భంగా మంగళవారం మండలంలోని జోగంపల్లి, నూర్జహాన్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, తల్లులతో కలిసి పోషణ ప్రతిజ్ఞ చేశారు. ప్రతి గర్భిణీ, బాలింతలు పోషకాహారం, చిరుధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. దీంతో పుట్టబోయే బిడ్డ ఎదుగుదల బాగుంటుందని అన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలు పట్టించాలని, ఆరు నెలల తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం ఇవ్వాలని సూచించారు. గర్భిణులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు శోభ, సాంబలక్ష్మి, వీఓ లీడర్ భారతి, అంగన్‌వాడీ టీచర్లు శారదాదేవి, కవిత, గర్భిణులు, బాలింతలు, తల్లులు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట: అవగాహన కల్పిస్తున్న ఏఎన్ఎం

మహిళలపై హింసను రూపుమాపాలి

- న్యాయవాది ఎ. శ్రీదేవి



మాట్లాడుతున్న న్యాయవాది శ్రీదేవి

కమలాపూర్: లింగ వివక్షను వీడాలని, ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలని న్యాయవాది ఎ. శ్రీదేవి సూచించారు. మండలంలోని గూడూరులో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు లింగ ఆధారిత హింసపై మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలపై హింసను రూపుమాపాలని, కుటుంబ సమస్యలకు వ్యక్తిగత అలవాట్లు , ఆలోచనలు కూడా కారణమవుతున్నాయని అన్నారు. సమస్యలకు గల కారణాలను గుర్తించి నివారించుకోవాలని కోరారు. గ్రామాల్లో మహిళా రక్షక దళాల ఏర్పాటుతో సమస్యలు త్వరితగతిన పరిష్కరించబడుతున్నాయని అన్నారు. అనతరం మహిళలకు గృహ హింస, నిర్భయ, పీసీపీఎన్‌డీటీ, వరకట్న నిషేద చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ హెప్సిబా మాట్లాడుతూ ఆడపిల్లలు, మహిళలకు హింస లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా సంస్థ పని చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ సిబ్బంది వినీల, అక్తర్, శ్రీలత, మహిళలు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యం ఎందుకు..?

- వైద్యాధికారిపై జెడ్పీ చైర్‌పర్సన్ సీరియస్



డాక్టర్ అనితపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గండ్ర జ్యోతి

శాయంపేట : 'రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి ప్రధాన్యతనిస్తూ దేనికి లోటు లేకుండా చూస్తోంది. సమాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత మీపై ఉంది. పీహెచ్‌సీలో సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి రిపోర్టును తెప్పించుకోవాలిన్న బాధ్యత మీదే. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధ, కార్యక్రమాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఎందుకు సమావేశాలు ఏర్పాటు చేయడం లేదంటూ' జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి స్థానిక వైద్యాధికారి అనితపై సీరియస్ అయ్యారు. స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కార్యక్రమం ప్రారంభోత్సవానికి మంగళవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై మెడికల్ ఆఫీసర్ చాంబర్‌ను ప్రారంభించారు. చాంబర్ చిన్నగా ఉండడంతో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కష్టమవుతుందని సమీపంలోని లేబర్ గదిలో ప్రతీ మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీ ప్రాంగణంలో సమావేశ ఏర్పాట్లు చేయకపోవడంతో వైద్యాధికారి అనితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుంటే.. సమావేశ నిర్వహణకు ఏర్పాట్లు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. డాక్టర్ అనితపై అసంతృప్తి వ్యక్తం చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ మహిళల ఆరోగ్యం కోసం మహిళ ఆరోగ్య కేంద్రాలు ప్రారంభిస్తుంటే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయలేదని ఫిర్యాదు చేశారు. దీంతో పీహెచ్‌సీ సిబ్బంది సమావేశానికి ఏర్పాట్లు చేయగా ఆమె పలు అంశాలపై మాట్లాడారు. ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది ప్రతీ ఇంటికెళ్లి మహిళలకు ఆరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహన కృలించాలని సూచించారు. సీఎం కేసీఆర్ వైద్య, విద్య, వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖప్రసవాలు జరిగిన వారికి కేసీఆర్ కిట్లు, పుట్టిన పిల్లలు రక్తహీనతకు గురికాకుండా న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 ఏళ్లు పైబడిన మహిళలకు ప్రత్యేకంగా ఎనిమిది వ్యాధుల గురించి 57 రక్త పరీక్షలు, కిడ్నీ, రక్తహీనత, గర్భసంచి సమస్యలు తలెత్తకుండా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించి చికిత్స చేస్తారని తెలిపారు. ఇటీవల డయాగ్నోస్టిక్ సెంటర్లు ప్రారంభించారని, వీటిలో 138 పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, సర్పంచ్ కందగట్ల రవి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, వైద్యాధికారి అనిత, క్లస్టర్ పోగ్రాం ఆఫీసర్ హిమబిందు, నాయకులు గుర్రం అశోక్, సదయ్య, శంకరాచారి, శివ, రాకేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద దళితులకు జీవనోపాధి కల్పించేదుకు ప్రవేశపెట్టిన దళితబంధు పథకం దళిత ఉద్యమకారులకు మంజూరు చేయాలని సీపీఐ నాయకుడు మారెపల్లి క్రాంతికుమార్ కోరారు. ఈ మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతికి మంగళవారం వినతిపత్రం అందించారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి



సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఎల్కతుర్తి: అంగన్‌వాడీ కార్యకర్తలను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం రెండోరోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరంతా బడుగుబలహీన వర్గాలకు చెందిన వారని అన్నారు. 48 సంవత్సరాలుగా ఐసీడీఎస్‌లో పనిచేస్తూ సేవలందిస్తున్నారని చెప్పారు. వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధత సౌకర్యాలను ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం క్రమంగా నిధులు తగ్గిస్తూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు బీఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని, ఐసీడీఎస్‌కు సంబంధం లేని పనులను అప్పగించొద్దని అన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా గుర్తిస్తూ ప్రకటించిన సర్క్యులర్‌ను వెంటనే జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2018 అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం టీచర్లకు రూ. 1500, హెల్పర్లకు రూ.750 పెంచిన వేతనాలను బకాయిలతో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే భీమదేవరపల్లి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మెకు బీజేపీ మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్ సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పుల్లా అశోక్, రమాదేవి, శోభారాణి, మనోహర్, అన్నపూర్ణ, కరుణ, విజయ, లలిత, కౌసల్య, ప్రేమలత, సరోజన, ఉమాదేవి, రజిత, మమత పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రవీందర్

దామెర: గృహలక్ష్మి ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ అన్నారు. మండలంలోని దుర్గంపేటలో గృహలక్ష్మి ఇళ్ల నిర్మాణాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందన్నారు. అన్ని గ్రామాల లబ్దిదారుల జాబితా త్వరలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు గండు రాము, సర్పంచ్ పురాణం రాజేశ్వరిఈశ్వర్, నాయకులు కాంతాల కేశవరెడ్డి, కొటం మోహన్, చెల్పూరి చంద్రయ్య, పొడాల మధూకర్, నూకల రవీందర్, వీరేశం, ముత్యా జుగూన్, గునిగంటి సాయికుమార్ ఉన్నారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం



బీజేపీలో చేరుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

పరకాల: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాద్‌రావు అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నరేంద్ర మోదీ 9 సంవత్సరాల పరిపాలనను మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. వెల్లంపల్లి బీఆర్ఎస్ గ్రామ ఉపాధ్యక్షుడు సూర సంతోష్, సూర లక్ష్మయ్యతో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతం కోసం ఆహర్నిషలు కృషి చేస్తామని కార్యకర్తలు తెలిపారు.

చరిత్రను వక్రీకరించడం సిగ్గుచేటు



సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

ధర్మసాగర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను కొందరు అవివేకులు వక్రీకరిస్తున్నారని, తెలంగాణ ప్రాంతంలోని ప్రతీ గ్రామంలో సాయుధ పోరాట చరిత్ర ఆనవాళ్ళు ఇప్పటికీ ఉన్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నైజాం నవాబు అరాచకాలను, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా బానిసత్వంలో మగ్గుతున్న తెలంగాణ ప్రాంత ప్రజలకు విముక్తి కల్పించేందుకు సీపీఐ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మొయినుద్దీన్‌లు పిలుపు నిచ్చారని గుర్తు చేశారు. 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచి, మూడు వేల గ్రామాలకు విముక్తి కల్పించారని, 4500 మంది కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తమ రక్తాన్ని చిందించారని తెలిపారు. ఈ చరిత్ర ప్రపంచ స్థాయిలో నిలిచిందని, నేటి తరానికి తెలిసే విధంగా పాలక ప్రభుత్వాలు పాఠ్యాంశాలలో చేర్చాలని కోరారు. సాయుధ పోరాటం జరిగి 75 సంవత్సరాలు దాటుతున్న ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం స్పందించిన దాఖలాలు లేవన్నారు. మరో ప్రక్క సాయుధ పోరాట చరిత్రను బీజేపీ, బీఆర్ఎస్ వక్రీకరిస్తూ ఏ మాత్రం సంబంధం లేని ముస్లిం, హిందువుల మధ్య కొట్లాగా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మానుకోవాలని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని, అధికారికంగా తెలంగాణ విలీన దినోత్సవాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి కొట్టె వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, బట్టు మల్లయ్య, మంచాల రమాదేవి, మాలోతు శంకర్‌నాయక్, రాజయ్య, చిలుక బాబు, రాజరత్నం, మర్రిపెల్లి అంకూస్, మంచాల తిరుపతి, బొడ్డు భిక్షపతి, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

తండాలో ఘనంగా సీత్లా భవాని వేడుకలు



సూర్యనాయక్‌తండాలో సీత్లా పండుగ చేసుకుంటున్న లంబాడీలు

శాయంపేట : మండలంలోని సూర్యనాయక్‌తండాలో లంబాడీలు మంగళవారం సీత్లా భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ భూక్య రమేష్, గ్రామ పెద్దలు బానోతు మొగిలి ఆధ్వర్యంలో మహిళలు, యువతులు బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లారు. డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ మేకలు, గొర్రెలను బలిచ్చారు. పాడి, పంటలు పిల్లాపాపలు చల్లగా ఉండాలని మొక్కులు చెల్లించుకొని నైవేద్యం సమర్పించారు. పిల్లల కేరింతలతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్, లక్ష్మణ్ నాయక్, రామస్, లచ్చునాయక్, మాలోతు రాజు, లింగునాయక్, మోహన్, అజ్మీర రఘు, కృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

కుల రాజకీయాలు మానుకోవాలి

దామెర: కుల రాజకీయాలు చేస్తే సహించేదిలేదని మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు మెంతుల రాజు హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని పులుకుర్తిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దామెర, ఆత్మకూర్ మండలాల మున్నూరుకాపు సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ఆ సమావేశానికి బీజేపీ నాయకుడు మొలుగూరి భిక్షపతి హాజరవ్వడం సరికాదని అన్నారు. కుల సంఘం సమావేశానికి ఆయన ఏ హోదాలో హాజరయ్యారో తెలుపాలని డిమాండ్ చేశారు. కుల సంఘాల సమావేశాలను రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. సమావేశం నిర్వహించిన బాధ్యులు, సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకుడు మొలుగూరి భిక్షపతి మున్నూరుకాపు కులస్తులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటు బ్యాంకు చర్యలకు సంఘం నాయకులు దూరంగా ఉండాలన్నారు. పార్టీలకు, రాజకీయలకు అతీతంగా సంఘం బతోపేతానికి కృషిచేయాలని ఆ సంఘం సభ్యులకు సూచించారు.

మండల సాధన పోరాట సమితి ఎన్నిక



తిరుపతిరావు



ముజీబ్ హుస్సేన్

కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో ఉప్పల్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం అఖిలపక్ష నాయకులు, గ్రామస్తులు సమావేశమై ఉప్పల్ మండల సాధన పోరాట సమితి (జేఏసీ) కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా నాయినేని తిరుపతిరావు, కో కన్వీనర్‌గా సయ్యద్ ముజీబ్ హుస్సేన్, సభ్యులుగా మారపల్లి నవీన్‌కుమార్, మొండెద్దుల రాజమౌళి, పుల్ల అద్భుతరావు, నాయినేని శ్రీనివాస్‌రావు, తోట సురేష్, పీఆర్ ఓడెలు, కొండ రమేష్, వెంగళ రవీందర్, మొండెద్దుల నాగరాజు, ఎర్రబెల్లి దేవేందర్‌రావు, మొర్రి ఓదెలు, ఎర్రబెల్లి సంపత్‌రావు, తూర్పాటి అరుణక్రాంతి, ఖాజా హసనోద్దీన్‌లు ఎన్నికయ్యారు.

సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్ రజితను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

శాయంపేట : మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామ పంచాయతీ స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు పొందడంతో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యక్రమంలో సర్పంచ్ రజిత శ్రీనివాస్‌ను పాలకవర్గ సభ్యులు శాలువాతో సత్కరించి స్వీట్లు తినిపించారు. గ్రామస్తులు, పాలకవర్గ సభ్యుల సహకారంతో అవార్డు పొందినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాయరాకుల మొగిలి, వార్డు సభ్యులు శంకర్‌రావు, గుండెకారి సాంబశివరావు, సుధాకర్‌రావు, రాజు, రాజేందర్, జీపి సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే నిర్వహించిన అధికారులు



అధికారులతో మాట్లాడుతున్న ఎస్సై రాజేందర్

దామెర: మండలంలోని ఊరుగొండ గ్రామంలో గల సర్వే నంబర్ 103, 118కు సంబంధించిన భూమి చల్లా శ్రీనివాస్‌రెడ్డి, కొటం ఐలయ్య మధ్య కొంత కాలంగా వివాదంలో ఉంది. కాగా ఇరువురు పోలీస్ స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అధికారుల సూచన మేరకు సర్వేకు దరఖాస్తు చేసుకోగా మంగళవారం డీఐ పవన్, సర్వేయర్ కవితారాణి సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. ఎస్సై ముత్యం రాజేందర్ పరిశీలించి అధికారులు నిర్ణయించిన హద్దుల ప్రకారం ఇరువర్గాలు అంగీకారం తెలపాలని అన్నారు.